క్లుప్తంగా

చెత్తాచెదారం తొలగింపు



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రధాన డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండి కంపు కొడుతున్నాయి. ఈనెల 12న సాక్షిలో 'అధ్వానంగా పారిశుద్ధ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ బుధవారం సిబ్బందితో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపజేశారు. స్థానికులకు చెత్తను డ్రెయినేజీలలో పడేయొద్దని సూచించారు.

స్టేడియంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



వాకర్స్‌తో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం స్టేడియం సందర్శించారు. వాకర్స్‌తో కలిసి నడుస్తూ పలు విషయాలు తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, స్టేడియంలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపు సందర్శించి క్రీడాకారులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, సిబ్బంది ఉన్నారు.

తాగి వాహనాలు నడపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

తానూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఎస్సై నవనీత్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు తమ వెంట ధ్రువపత్రాలను ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

పనులు వేగవంతం చేయండి




పనులు పరిశీలిస్తున్న అంబాజీ

లక్ష్మణచాంద: మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీటీడబ్ల్యూవో జాదవ్ అంబాజీ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా రెండు పూటలా నీళ్లు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్ ఉన్నారు.

భూమి ఆక్రమిస్తే కఠినచర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సర్కారు భూములు ఆక్రమణకు గురవుతుండడాన్ని గుర్తించామని తెలిపారు. వాటిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో రెవెన్యూశాఖ సర్వే చేసిందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

పెట్రోలింగ్ విధుల్లో మహిళలు



జిల్లాకేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో తనిఖీ చేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

నిర్మల్‌టౌన్: నారీశక్తి ప్రోగ్రాంలో భాగంగా మహిళా పోలీసులు బుధవారం జిల్లా కేంద్రంలో పెట్రోలింగ్ విధులు నిర్వర్తించారు. ఇందులో భాగంగా డయల్ 100కు వచ్చిన సమస్యలను పరిష్కరించారు. అనంతరం మంచిర్యాల చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు.
కుంటాల: మండలంలోని అర్లి(కె) క్రాస్‌రోడ్, కల్లూరు, కుంటాల గ్రామాల్లో మహిళా కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కానిస్టేబుళ్లు అనుప్రియ, అశ్విని, సిబ్బంది ఉన్నారు.

డ్రెయినేజీ నిండి దుర్గంధం



నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రెయినేజీ నిండి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. కొన్ని నెలలుగా ఇదే సమస్య ఉందని.. మున్సిపల్ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్న పచ్చదనం

కుంటాల: కుంటాల నుంచి అంబకంటి వెళ్లే రోడ్డు మార్గంలో పచ్చదనం ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతోంది. పదేళ్ల కిందట హరిత హారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు పచ్చని తోరణంలా చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



స్తంభం తొలగించడం మరిచారు



నర్సాపూర్(జి): మండలంలోని తిమ్మాపూర్(జి) గ్రామంలో 28వ ప్యాకేజీ కెనాల్‌పై నుంచి వంతెన వేసి సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. కానీ రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించలేదు. కాంట్రాక్టర్ స్తంభాన్ని తొలగిస్తానని చెప్పి పట్టించుకోవడం లేదని.. ప్రమాదాలు జరగకముందే రోడ్డుపై ఉన్న స్తంభాన్ని పక్కకు తరలించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా.?

భైంసారూరల్: భైంసా మండలంలోని వాలేగాం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సీసీ రోడ్డు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ గమనించక వెళ్లే జనం ప్రమాదాల బారిన పడుతున్నారని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.



ధ్వంసమైన సీసీ రోడ్డు

కొయ్యలను భూమిలోనే దున్నేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్

లోకేశ్వరం: మొక్కజొన్న, వరి పంట కొయ్యల అవశేషాలను కాలిస్తే భూమి నిస్సారంగా మారుతుందని.. వాటిని కలియ దున్నితే భూమి సారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) అంజిప్రసాద్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తీసుకొచ్చిన మట్టికి భూసార పరీక్షలు చేశారు. అనంతరం ఎరువులను ఎంత మోతాదులో వాడాలో వివరించారు. ప్రతి రైతు విధిగా రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రసాయనాలు కాకుండా సేంద్రియ ఎరువుల వినియోగంపై మొగ్గు చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో గిరిరాజ్, ఏఈవోలు భూమేశ్, అశోక్, మౌనిక, మౌనిక, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.
నర్సాపూర్ (జి): మొక్కజొన్న పంట అవశేషాలను కాల్చొద్దని డీఏవో అంజిప్రసాద్ పేర్కొన్నారు. ఆయన లోకేశ్వరం రైతువేదికకు వెళ్తుండగా నర్సాపూర్ (జి)మండలంలోని అర్లి (కే) గ్రామ శివారులోని రైతులు తమ చేనులో మొక్కజొన్న పంట అవశేషాలను కాలుస్తున్నారు. గమనించిన డీఏవో అక్కడ ఆగి మంటలను ఆర్పి వేయించి కలియ దున్నడం వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు.



లోకేశ్వరం: భూసార పరీక్ష చేస్తున్న డీఏవో అంజిప్రసాద్, పక్కన సిబ్బంది

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని.. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి సీనియర్ జడ్జి రాధిక తెలిపారు. జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని బుధవారం డీఈవో రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం గురించి తెలుసుకోవాలని సూచించారు. పోక్సో చట్టంలోని పలు సెక్షన్లు, శిక్షల అమలు గురించి వివరించారు. మహిళా ఉపాధ్యాయులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించి, వారు చైతన్యవంతులని పేర్కొన్నారు ఎఫ్ఏవో వెంకటరమణారెడ్డి, కోర్స్ ఇన్‌చార్జీలు, డీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధ్యాయులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రామారావు సూచించారు. జిల్లా కేంద్రంలోని చాణక్య పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, 100 శాతం హాజరు కావాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరు కాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తరగతులకు వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలని, డీఆర్పీలు చెప్పే విషయాలను అవగాహన చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి రాధిక

వర్షంతో రైతులకు నష్టం



ఖానాపూర్ మార్కెట్ యార్డులోంచి నీటిని బయటకు పంపిస్తున్న రైతు



దస్తురాబాద్ కేంద్రంలో తడిసిన బస్తాలు

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. రెండు రోజులుగా ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న, మామిడి వంటి పంటలకు నష్టం వాటిల్లింది. కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని కోరుతున్నారు.
దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట, భూత్కూర్, దస్తురాబాద్, మున్యాల గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. ఉదయం ఒక్కసారిగా రావడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

అప్పటి ఎస్సై.. నేడు డీఎస్పీ

- వివాహ వేడుకకు హాజరైన మోహన్

లక్ష్మణచాంద: ఎందరో అధికారులు మన ప్రాంతానికి వచ్చినా కొందరు మాత్రమే వారు చేసిన పనుల కారణంగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. అలాంటి కోవలోకే వస్తారు ఈ అధికారి. మండల కేంద్రంలో బుధవారం జరిగిన రాంరెడ్డి కూతురు వివాహ వేడుకకు కరీంనగర్ పీటీసీ(పోలీస్ శిక్షణ కేంద్రం) డీఎస్పీ మోహన్ హాజరయ్యారు. ఈయన లక్ష్మణచాంద మండల ఎస్సైగా 1999 నుంచి నాలుగేళ్లు విధులు నిర్వర్తించాడు. తర్వాత బదిలీ, పదోన్నతులపై ఇతర చోట్లకు వెళ్లినా లక్ష్మణచాంద మండలవాసులతో స్నేహబంధం కొనసాగిస్తున్నాడు. ఎక్కడ పనిచేసినా స్థానికులతో మమేకం కా వడం.. యువకులను సన్మార్గంలో వెళ్లేలా తీర్చిదిద్దడం ఈయన ప్రత్యేకత. తాను పనిచేసిన ప్రాంతం కావడంతో వివాహానికి వచ్చిన వారు ఈయనను ఆప్యాయంగా పలకరించారు. మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, ముత్యంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు ఓస రాజేశ్వర్, సిరాజ్, రాజు, రాజేంద్రప్రసాద్, రాజారాం తదితరులు ఉన్నారు.



మండలవాసులతో డీఎస్పీ మోహన్

ఎర్త్ రాడ్లతో ముప్పు

- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు
- కంచె ఏర్పాటు చేయాలని వేడుకుంటున్న రైతులు



జామ్-యాకర్‌పెల్లి రహదారిలో రెండు ఫీట్ల ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

సారంగపూర్: ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్త్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన ఇనుపరాడ్లు పశువుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరా అవుతున్న ఈ ఇనుప రాడ్లను గమనించకుంటే పశువులతోపాటు మనుషులు సైతం విద్యుత్ ప్రమాదాలకు బలవుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్త్ రాడ్ల చుట్టూ కంచెల ఏర్పాటు చేయడంతోపాటు వేలాడుతున్న తీగలు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సారంగపూర్ మండలవ్యాప్తంగా గృహాలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు దాదాపు 130 వరకు, వ్యవసాయ వినియోగ ట్రాన్స్‌ఫార్మర్లు 860 వరకు ఉన్నాయి. అయితే వీటిలో ఏయే ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్ కనెక్షన్ రాడ్లకు కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యుత్ సరఫరా అవుతున్న ఎర్త్ రాడ్లకు తగిలి తరచూ పశువులు మృత్యువాత పడుతున్నాయి.
గత నెల 4న సారంగపూర్ మండలం జామ్ గ్రామంలో అవధూత్ నరేశ్‌కు చెందిన ఆవు ఇందిరమ్మ కాలనీలో శివాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే చిన్నారులు, యువకులు ఆటలు ఆడుతుంటారు. వీరికి ముప్పు పొంచి ఉంది. ఇదే గ్రామంలో సుదర్శన్ అనే రైతుకు చెందిన ఎద్దు సైతం మేత మేస్తూ ఎర్త్ రాడ్‌కు తగిలి ట్రాన్స్‌ఫార్మర్ వద్దే మృతి చెందింది. గడిచిన రెండేళ్లలో ఈ తరహా పశువుల మరణాలు సుమారు 21 వరకు జరిగాయి.

చేతికి అందేలా ట్రాన్స్‌ఫార్మర్లు..

మండలంలోని పలు గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. వాటిని ఎత్తయిన ప్రదేశాలకు తరలించే చర్యలు చేపట్టడం లేదు. పశువులు మృతి చెందాక విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి.. అవసరమైతే మరమ్మతులు చేసి వెళ్తున్నారు తప్ప.. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ రాడ్లకు కంచెలు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలున్నాయి.

పలు గ్రామాల్లో..

మండలంలో ఈ తరహా ట్రాన్స్‌ఫార్మర్లు జామ్-యాకర్‌పెల్లి రహదారిలో, అలాగే జామ్, సారంగాపూర్, చించోలి(బి), ధని, యాకర్‌పెల్లి, స్వర్ణ, మలక్‌చించోలి, తాండ్ర(జి), కంకెట గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో అధికంగా ఉన్నాయని.. వీటికి కంచెలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు..

సారంగపూర్ మండలంలోని జామ్, చించోలి(బి), సారంగాపూర్, యాకర్‌పెల్లి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. అడెల్లి ఆలయం ఎదుట దేవితండా రహదారికి పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో వేలాడే తీగలను అధికారులు సరిచేయకపోవడంతో రైతులే కర్రస్తంబాలు ఏర్పాటు చేసుకున్నారు.



గత నెల 4న విద్యుత్ సరఫరా అవుతున్న ఎర్త్ రాడ్‌కు తగిలి మృతిచెందిన ఆవు



చించోలి(బి) గ్రామంలో చేతికి అందే ఎత్తులో తీగలు ఉన్నాయని చూపుతున్న రైతు

కంచెలు ఏర్పాటు చేయిస్తాం

మండలంలోని పలు గ్రామాల్లో కొత్తగా 10 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే పనులు జరగనున్నాయి. ఈ పనులతోపాటు ఎర్త్ రాడ్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయిస్తాం. వేలాడే విద్యుత్ తీగలను సరిచేసి అవసరమైన స్తంభాలు, చేతికి అందేలా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తయిన ప్రదేశాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.
– సాయికిరణ్, ట్రాన్స్‌కో ఏఈ, సారంగపూర్

కిరాణంలో చోరీ

నర్సాపూర్ (జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో 61వ జాతీయ రహదారి పక్కన మంగళవారం అర్ధరాత్రి సలీంకు చెందిన కిరాణ ఇంట్లో చోరీ జరిగింది. షాపు యజమాని, స్థానికుల వివరాల ప్రకారం.. సలీం బుధవారం ఉదయం 6 గంటలకు కిరాణం తెరిచేందుకు రాగా షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నా యి. షాపు లోపలకు వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉన్న రూ.మూడు వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం'

భైంసారూరల్: రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు విలాస్‌గాదేవార్ అన్నారు. బుధవారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వం, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై క్వింటాలు ధాన్యానికి ఏడున్నర కిలోల వరకు తరుగు విధిస్తూ రైతుల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెంట నాయకులు సురేశ్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

నేడు సాగుపై అవగాహన

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో గురువారం ముథోల్ ఎరువాక కేంద్రం ఆధ్వర్యంలో పంటల సాగుపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్త నర్సయ్య తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు రావాలని కోరారు.

టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

సారంగపూర్: బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు కోసం మండలంలోని రవీంద్రనగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో స్థలాన్ని బుధవారం ఎఫ్ఆర్ఓ రామక్రిష్ణారావు పరిశీలించారు. ఈసందర్భంగా టవర్ నిర్మించే స్థలానికి హద్దులు నిర్ణయించారు. ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్టు ప్రకారం ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ, బీఎస్ఎన్ఎల్, అటవీశాఖ సిబ్బంది యూజర్ ఏజెన్సీగా ఏర్పాటై టవర్ పనులను పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్ఓ రషీద్, ఎఫ్‌బీఓ స్రవంతి, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



కొలతలు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

20 ఏళ్లకు కలిసిన వేళ..



పెంబి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో2004–05లో పదోతరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ వేడుకకు తాము చదివిన పాఠశాల వేదికగా నిలిచింది. ఈ సమ్మేళనానికి ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ జిల్లాలు, విదేశాల్లో స్థిరపడినవారు సైతం తరలివచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

గుంతలు పూడ్చివేయరూ..



పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రమాదకరంగా రోడ్డు

బాసర: మండలకేంద్రంలోని పలు చోట్ల రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి గుంతలు కన్పించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. బస్టాండ్, పోలీస్‌స్టేషన్, శారదనగర్, రవీంద్రాపూర్ ప్రాంతాల్లో రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.



బాసర ఆలయ ప్రాంగణ సమీపంలో...